RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:80 | మార్చి 07, 2026 | వెల: రూ.3-00

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను

## విజయవంతం చేయాలి



- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఖమ్మంలో సన్నాహక సమావేశం
- 99 రోజుల కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం

2లో

# రిటైర్డ్ గోస!

## ఆర్థిక ఇబ్బందుల్లో విశ్రాంత ఉద్యోగులు




- సేవ చేసిన మనషులకు 'దారిద్ర్యపు' సవాళ్లు
- ఆర్థిక క్షోభతో 74 మంది పెన్షనర్ల బలి
- హెల్త్ కార్డులు గాలికి.. వైద్యం అందక అప్పుల పాలు
- జీపీఎఫ్, గ్రాట్యుటీ నిధుల కోసం వృద్ధాప్యంలో ఆందోళన
- ఇందిరా పార్క్ సాక్షిగా 'వృద్ధ' ఘోష..
- తమకు అందాల్సిన బెనిఫిట్స్ అందించాలని పెన్షనర్ల వేడుకోలు
- హామీలు నెరవేర్చాలంటున్న ఉద్యోగులు

2లో

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

దశాబ్దాల పాటు ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేసి.. సమాజ సేవలో తమ జీవిత కాలాన్ని ధారబోసిన రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి నేడు ఇబ్బందుల్లో ఉంది. విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాల్సిన వేళ.. తమ సొంత నిధుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన ఏడాది కాలంలో.. దాదాపు 24,678 మంది విశ్రాంత ఉద్యోగులు తమ గ్రాట్యుటీ, జీపీఎఫ్ సొమ్ము కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఆర్థిక క్షోభతో, సరైన వైద్యం అందక 74 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మలి దశలో విశ్రాంత జీవనం గడపాల్సిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్ అన్నీ అందించాలన దీనంగా వేడుకుంటున్నారు.

## రిటైర్డ్ ఎస్సై సూర్యనారాయణ దీనగాథ

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి ముప్పిడి సూర్యనారాయణ. పోలీస్ శాఖలో ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. తన సర్వీసు కాలంలో ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఆయన, ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. తీవ్రమైన షుగర్ కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి, వైద్యుల సూచన మేరకు మోకాలి కింది భాగాన్ని తొలగించాల్సి వచ్చింది. ఈ శస్త్రచికిత్స, దానికి సంబంధించిన వైద్యం కోసం ఆయనకు సుమారు రూ. లక్షా 90వేల వరకు ఖర్చయింది. పదవీ విరమణ చేసిన తర్వాత ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం సకాలంలో అందకపోవడంతో ఆయన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వైద్యం కోసం ఖర్చు చేసిన సొమ్ము ఇంతవరకు తిరిగి రాకపోవడమే కాకుండా, ఆయనకు చట్టబద్ధంగా అందాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ నిధులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. శారీరక వైకల్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో ఆయన తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. తనకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేసి, ఈ పరిస్థితుల్లో తనను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని దీనంగా వేడుకుంటున్నారు. ముప్పిడి సూర్యనారాయణ పరిస్థితి కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 24,678 మంది రిటైర్డ్ ఉద్యోగులు ఇలాగే తమ నిధుల కోసం ఎదురుచూస్తూ అవస్థలు పడుతున్నారు.






# సివిల్స్ ఫలితాలు విడుదల

- ఆల్ ఇండియా టాపర్‌గా అనుజ్ అగ్నిహోత్రి
- మొత్తం 958 మందికి ఎంపిక
- సివిల్స్ విజేతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు
- తెలంగాణ అభ్యర్థుల విజయంపై హర్షం

2లో

వేద న్యూస్, హైదరాబాద్

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ పరీక్ష–2025 తుది ఫలితాలు విడుదలయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా వివిధ కేంద్ర సేవల కోసం మొత్తం 958 మంది అభ్యర్థులను యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఈ ఫలితాల్లో అనుజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలిచారు. రాజేశ్వరి సువే రెండో ర్యాంకు, అకన్ష్ ధుల్ మూడో ర్యాంకు సాధించారు. ఈసారి ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు కూడా తమ ప్రతిభను చాటుకున్నారు. దాదాపు 30 మందికి పైగా తెలుగు అభ్యర్థులు సివిల్

మిగతా 2వ పేజీలో



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను

## దీక్షలా అమలు చేయాలి

### అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు చేరాలి

- ఉద్యోగులే ప్రభుత్వానికి కళ్లు, చెవులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై అభినందన సభ


2లో

99 రోజుల యాక్షన్ ప్లాన్

## కేవలం ప్రచారమే

### రైతులు, యువత సమస్యలను తీర్చండి

- ప్రభుత్వ హామీలు ఇంతవరకు అమలు కాలేదు
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై హరీష్ రావు తీవ్ర విమర్శలు





## ఇంటి ముందు ముగ్గు వేస్తుంటే..

- మహిళ మెడలోని బంగారు చెయిన్ లాక్కొని పరారీ
- సీసీటీవీ ఆధారంగా దుండగుల కోసం గాలింపు
- హన్మకొండలో చెయిన్ స్నాచింగ్ కలకలం

2లో

16 ఏళ్లలోపు పిల్లలకు

# సోషల్ మీడియా బ్యాన్




### కర్ణాటక ప్రభుత్వ కీలక నిర్ణయం

- పిల్లల ఆరోగ్యం రక్షణే లక్ష్యం
- దేశంలో ఇదే తొలి చర్చ

2లో

వేద న్యూస్

శనివారం | మార్చి 07, 2026

# 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

**వేద న్యూస్, డెస్క్**

ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో చిన్నారులపై ప్రతికూల ప్రభావం పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్ణాటక అసెంబ్లీలో 2026–27 వార్షిక బడ్జెట్ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ విషయాన్ని వెల్లడించారు. చిన్నారుల్లో మితిమీరిన స్మార్ట్‌ఫోన్ వినియోగం వల్ల అనేక రకాల మానసిక మరియు శారీరక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తీవ్రమైన ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం తెలిపింది. చిన్న వయస్సులోనే డిజిటల్ వ్యసనం పెరగడం వల్ల చదువుపై దృష్టి తగ్గడం, నిద్రలేమి, ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. అందుకే 16 సంవత్సరాల లోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మైనర్లకు సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణలు అమలులో ఉన్నాయి. అయితే భారతదేశంలో 16 సంవత్సరాల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించిన తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. ఈ నిర్ణయం ఇతర రాష్ట్రాలకు కూడా మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఇంటి ముందు ముగ్గు వేస్తుంటే..

- మహిళ మెడలోని బంగారు చెయిన్ లాక్కొని పరారీ
- సీసీటీవీ ఆధారంగా దుండగుల కోసం గాలింపు
- హన్మకొండలో చెయిన్ స్నాచింగ్ కలకలం

**వేద న్యూస్, హన్మకొండ**

హన్మకొండలోని ఎక్సైజ్ కాలనీలో చెయిన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. ఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ మెడలోని బంగారు చెయిన్‌ను గుర్తు తెలియని దుండగులు లాక్కొని బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు మామిండ్ల నవ్య ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న బంగారు చెయిన్‌ను లాక్కొని అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. ఈ ఘటనతో కాలనీలో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘటనపై బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ దుండగులను గుర్తించేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**




ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి 99 రోజుల కార్యాచరణ ద్వారా మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు జిల్లా అధికారులు హాజరయ్యారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు కార్యక్రమం అమలు విధానంపై దిశానిర్దేశం చేశారు. 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం, ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, రోడ్డు భద్రత, సంక్షేమం, పిల్లల రక్షణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత మరియు క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలను తేడా లేకుండా అందరూ భాగస్వాములు కావాలని మంత్రి అన్నారు. స్థానికంగా చేయాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వం ప్రాధాన్యత ఆధారంగా నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే మార్చి 12న కొత్తగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కొత్త ప్రజాప్రతినిధులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# రిటైర్డ్ గోస!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో దశాబ్దాల పాటు సేవలందించి, పదవీ విరమణ చేసిన వేలాది మంది ఉద్యోగుల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. ప్రశాంతంగా గడపాల్సిన వృద్ధాప్యంలో తమ సొంత నిధుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములై, తమ జీవిత కాలమంతా ప్రభుత్వ సేవకే అంకితం చేసిన రిటైర్డ్ ఉద్యోగుల బతుకులు నేడు సర్కార్ తీరు వల్ల బలైపోతున్నాయి. పదవీ విరమణ తర్వాత వచ్చే నిధులతో పిల్లల పెళ్లిళ్లు చేయాలని, ఇల్లు కట్టుకోవాలని లేదా అనారోగ్య సమయాల్లో వాడుకోవాలని ఆశపడ్డ వేలాది మంది పెన్షనర్లకు నేడు నిరాశే మిగులుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన ఏడాది కాలంలో రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి వారి ప్రాణాల మీదికి తెస్తోంది.




### ఆర్థిక సంక్షోభంలో పెన్షనర్లు..

తెలంగాణలో గత మార్చి 2024 నుంచి నేటి వరకు రిటైరైన సుమారు 24,678 మంది ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. వీరికి రావాల్సిన గ్రాట్యుటీ, ఎన్‌క్యాష్‌మెంట్, జీఎల్ఐసీ, కమ్యూటేషన్ సహా ఇతర ప్రయోజనాలన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు సుమారు రూ.10వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, అది మాటలకే పరిమితమైంది. ఇదే వేగంతో చెల్లింపులు జరిగితే, మొత్తం బకాయిలు తీరడానికి మరో పదేళ్లు పడుతుందని, అప్పటి వరకు ఈ వృద్ధులు బతికే ఉంటారా? అని ఉద్యోగ సంఘాలు నిలదీస్తున్నాయి.

### వైద్యం అందక గాల్లో ప్రాణాలు..

పదవీ విరమణ చేసిన వారికి వయస్సు రీత్యా వచ్చే అనారోగ్య సమస్యలు నేడు శాపంగా మారుతున్నాయి. మెరుగైన వైద్యం అందించాల్సిన హెల్త్ కార్డులు రెండేళ్లుగా అలంకారప్రాయంగా మారాయి. రేవంత్ సర్కార్ హయాంలో ఆర్థిక ఇబ్బందులు మరియు మానసిక క్షోభ కారణంగా ఇప్పటివరకు సుమారు 74 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించడం అత్యంత బాధాకరం.

### ప్రాధాన్యత లేని పథకాలకు వేల కోట్లు..

ఒకవైపు మూసీ పునరుద్ధరణ, ఫోర్త్ సిటీ, అందాల పోటీలు, గాంధీ సరోవర్ వంటి సుందరీకరణ ప్రాజెక్టుల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. ప్రాణాలు కాపాడే పెన్షనర్ల బకాయిలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మీకు ఇవ్వడానికి ఏ సంక్షేమ పథకం ఆపాలి? అని సీఎం స్వయంగా ఉద్యోగులను అడగడం వారిని బెదిరించడమేనని విమర్శలు వస్తున్నాయి. రైతు భరోసా, రుణమాఫీ, పెన్షన్ల పేరుతో కాలయాపన చేస్తూ, అనవసరపు హంగులకు ప్రాధాన్యత ఇస్తున్నారని రిటైర్డ్ ఉద్యోగులు మండిపడుతున్నారు.

### హెల్త్ స్కీమ్ పై పెన్షనర్ల ఆందోళన

కాంట్రిబ్యూషన్ హెల్త్ స్కీమ్ కింద ఉద్యోగులు, పెన్షనర్ల మూలవేతనం నుంచి 1.5 శాతం కోత విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా ఏటా రూ.600 కోట్లు జమ అవుతాయి. అయితే, ప్రభుత్వం తన వంతుగా ఇవ్వాల్సిన రూ.600 కోట్లను విడుదల చేస్తుందా? లేక ఉద్యోగుల నుంచి వసూలు చేసి చేతులు ఎత్తేస్తుందా? అన్న అనుమానం పెన్షనర్లలో బలంగా ఉంది. మొదట ప్రభుత్వం తన నిధులు విడుదల చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, లేదంటే ఇది మరో మోసంగా మిగిలిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్థిక ఇబ్బందుల్లో రిటైర్డ్ ఉద్యోగులు

- సేవ చేసిన మనుషులకు 'దారిద్ర్యపు' సవాళ్లు
- ఆర్థిక క్షోభతో 74 మంది పెన్షనర్ల బలి
- హెల్త్ కార్డులు గాలికి.. వైద్యం అందక అప్పుల పాలు
- జీపీఎఫ్, గ్రాట్యుటీ నిధుల కోసం వృద్ధాప్యంలో ఆందోళన
- ఇందిరా పార్క్ సాక్షిగా 'వృద్ధ' ఘోష..
- తమకు అందాల్సిన బెనిఫిట్స్ అందించాలని పెన్షనర్ల వేడుకోలు
- హామీలు నెరవేర్చాలంటున్న ఉద్యోగులు

### ప్రజా పోరాటమే శరణ్యం!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పీఆర్సీ జాడే లేదు, ఐదు డీఏలు అందని ద్రాక్షగా మారాయి. కనీసం ఒకటో తేదీన వేతనాలు కూడా అందడం లేదు. గత కేసీఆర్ హయాంలో రెండు సార్లు పీఆర్సీ, 78 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన విషయాన్ని రిటైర్డ్ ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. తమను విస్మరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. రిటైరయ్యాక ఆనందంగా గడపాల్సిన పెన్షనర్లు నేడు ఇందిరా పార్క్, కలెక్టరేట్ల వద్ద నిరసనలకు దిగడం రాష్ట్రానికే అవమానకరం. రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ఈ ప్రజా వ్యతిరేకత ప్రతిబింబిస్తుందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రూ.10 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు వేడుకుంటున్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను దీక్షలా అమలు చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**




రాష్ట్రంలో అర్హులైన పేదవారందరికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని చేపట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ 99 రోజుల కార్యాచరణను ఒక దీక్షగా అమలు చేస్తే పేదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేసిన వారవుతారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో వ్యవహరిస్తే చివరి పేదవాడి వరకు సంక్షేమ ఫలాలు అందుతాయని సీఎం పేర్కొన్నారు. ప్రగతి ప్రణాళికలో ఒక్కరోజు నిర్లక్ష్యం కూడా పది దళిత కుటుంబాలకు న్యాయం జరగకుండా చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు, బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన నేపథ్యంలో మాదిగ ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. వచ్చే అంబేద్కర్ జయంతి నాటికి మాదిగల ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం ఎన్నో దశాబ్దాలుగా పోరాటం జరిగిందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు పరిమితంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని సీఎం తెలిపారు. ప్రతి నెల వెయ్యి మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తుండటంతో రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం భారీ వ్యయం అవుతోందని అన్నారు. అక్రమాలను అరికట్టి ఖజానాకు ఆదాయం పెంచడంలో ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. దళిత సమాజం అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యా రంగాన్ని ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సివిల్స్ ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

సర్వీసెస్‌లో విజయాన్ని సాధించడం విశేషం. ఆల్ ఇండియా 23వ ర్యాంకుతో జీను శ్రీ జస్వంత్ చంద్ర, 55వ ర్యాంకుతో పెద్దపల్లి జిల్లాకు చెందిన గుడెల్లి సృజన తెలుగు రాష్ట్రాల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. వీరిద్దరూ ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఇతర తెలుగు అభ్యర్థుల్లో పోలవరపు ధ్వనీష్ 108వ ర్యాంకు, అట్ల తరుణ్ తేజ 123వ ర్యాంకు, శ్రీగిరిరాజు వి.పి.ఎస్. సాయి కృష్ణ 125వ ర్యాంకు, కొలిపాక శ్రీకృష్ణ సాయి 150వ ర్యాంకు, బానోత్ లక్ష్మి రచన 178వ ర్యాంకు సాధించారు.

### విజేతలకు సీఎం అభినందనలు

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈసారి యూపీఎస్సీ ఫైనల్ ఫలితాల్లో తెలంగాణకు చెందిన అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద కుటుంబాల విద్యార్థులకు అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని అమలు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం ద్వారా సహాయం పొందిన అభ్యర్థుల్లో 51 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని తెలిపారు.

# 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ప్రచారమే

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

### రైతులు, యువత సమస్యలను తీర్చండి

- ప్రభుత్వ హామీలు ఇంతవరకు అమలు కాలేదు
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై హరీష్ రావు తీవ్ర విమర్శలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' పేరుతో అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్రోగ్రామ్‌పై బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమం ప్రజలకు ప్రయోజనం కలిగించేదిగా కాకుండా కేవలం ప్రచార కార్యక్రమంగా మాత్రమే నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలు గడిచిపోయినా ప్రజలకు గణనీయమైన అభివృద్ధి కనిపించలేదని ఆయన వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్ల పాలనలో చేసిన పనులేమీ లేకపోవడంతో ఇప్పుడు 99 రోజుల ప్రణాళిక పేరుతో మరో కార్యక్రమానికి తెరలేపారని హరీష్ రావు విమర్శించారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి లక్షల సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ అవి ఇంకా పరిష్కారం కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కొత్త కార్యక్రమాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. రైతుల సమస్యల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని హరీష్ రావు ఆరోపించారు. కోతల కాలం వచ్చినప్పటికీ రైతు భరోసా అమలు కాలేదని, గత సీజన్‌కు సంబంధించిన పంట బోనస్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. అంతే కాకుండా యూరియా సరఫరా విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులను నమ్మించి మోసం చేశారని ఆయన ఆరోపించారు. యువతకు ఉద్యోగాల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోలేదని హరీష్ రావు పేర్కొన్నారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను నిరాశపరిచారని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి చివరకు అది 'జాబ్‌లెస్ క్యాలెండర్'గా మారిందని విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఇతర కార్యక్రమాల పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో కూడా పరిస్థితి మెరుగుపడలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఆసుపత్రుల్లో సరైన మందులు లేవని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోతున్నాయని, గ్రామాల్లో పారిశుద్ధ్యం కూడా దెబ్బతిన్నదని అన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వంటి సాధారణ బాధ్యతలను కూడా పెద్ద కార్యక్రమంలా చూపిస్తూ ప్రచారం చేసుకోవడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన కొద్దిమందిని చూపిస్తూ ప్రచారం చేయడం కంటే, హామీలు అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న లక్షలాది ప్రజల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి కేవలం ప్రచార కార్యక్రమాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విధానాలపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, గ్రామ గ్రామాన ప్రజలు ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉన్నారని హరీష్ రావు పేర్కొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

## – ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శానిటేషన్ పనులు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆరోగ్య కేంద్రం ప్రాంగణం లో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంతో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిప్ప గణేష్, తహసీల్దార్ వరప్రసాద్, ఎస్సై జీ. నవీన్ కుమార్, మండల వైద్యాధికారి వనజ, సర్పంచ్ బద్దం గోపి, ఏపీఎం శంకర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలకు సొంత ఇల్లు

## – ఎమ్మెల్యే మేడిపల్లికి ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారులు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన ఇంటికి వెదిరె స్వప్నపర్శరాం కుటుంబం నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు సొంత ఇల్లు కల నెరవేరుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ-రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం చేసిన సహకారాన్ని కుటుంబ సభ్యులు స్మరించుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ కళ్లేపల్లి సతీష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం కనకయ్య, జూలపల్లి సంపత్ రావు, వార్డు సభ్యులు దమ్మ వెంకటరమణ, పోలె శేఖర్, జోగు శంకర్, గోల్కొండ సురేష్, సుంకపాక అనిల్, గ్రామ



కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్, గోల్కొండ శ్యామ్ బాబు, దమ్మ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక’పై సమీక్ష

## – బోయినిపల్లిలో సర్పంచులు, అధికారులతో సమావేశం

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో నిర్వహించగా, మండలంలోని సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రోడ్ల శుభ్రత, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, బస్ స్టాండ్ల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజా పాలన, ఫుడ్ సెక్యూరిటీ, గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ వంటి ప్రభుత్వ పథకాల వివరాలను గ్రామాల వారీగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. బోయినిపల్లి, కొదురుపాక, విలాసాగర్ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఐదుగురు సభ్యులతో వైద్య బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ స్తంభాల మరమ్మత్తులు, రెవెన్యూ సమస్యల పరిష్కారం, పంట మార్పు, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహం, మట్టి నాణ్యత పరీక్షలు వంటి అంశాలపై



కూడా అధికారులు వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో పాటు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలుపై సమగ్రంగా అవగాహన కల్పించారు.

# సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలిగా కొదురుపాక సర్పంచ్

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలిగా కొదురుపాక గ్రామ సర్పంచ్ డా. కత్తెరపాక మంజుల సుధాకర్‌ను మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి నియమించారు. మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారిని చైతన్య దిశగా నడిపించాలని కోరుతూ వెంటనే ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించాలని అధ్యక్షుడు సూచించారు. ఈ సందర్భంగా డా. కత్తెరపాక మంజుల సుధాకర్ మాట్లాడుతూ సర్పంచుల సమస్యలపై తన వంతుగా పోరాటం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, మండలంలోని సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# రాజకీయంగా జన్మనిచ్చిన గడ్డను మరువను



- విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- చందుర్తి పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు ప్రారంభం

**వేద న్యూస్, చందుర్తి:**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పిల్లల వైద్యం, కంటి, దంత, ఎముకల వైద్య నిపుణుల సేవలను ప్రారంభించారు. పలువురు ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం చందుర్తిలోని కేజీబీవీ విద్యార్థులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్, సీపీఆర్‌పై అవగాహన కల్పించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాపాలనప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేరువ చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ పథకం కింద గ్రామాలు, మున్సిపాలిటీలలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. తనకు రాజకీయంగా జన్మనిచ్చిన చందుర్తి గడ్డను ఎప్పటికీ మరవనని, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కింద 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లలో పరిశుభ్రత పనులు చేపట్టాలని, రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ ఉన్నత లక్ష్యాలతో చదవాలని సూచించారు.

# సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు

## – వేద న్యూస్ కథనానికి స్పందన




**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో “కానరాని సమాచార హక్కు చట్టం బోర్డు“ అనే శీర్షిక వేద న్యూస్ పత్రికలో గురువారం ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డును ఏర్పాటు చేశారు.

# గందరగోళంగా బాన్సువాడ బస్టాండ్

- అవుట్‌గేట్ వద్ద ఆటోలతో అస్తవ్యస్తంగా ట్రాఫిక్
- సిగ్నల్ ఉన్నా పట్టించుకోని డ్రైవర్లు
- సెక్యూరిటీ సిబ్బంది లేక ప్రయాణికుల ఆందోళన
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**వేద న్యూస్, బాన్సువాడ:**

బాన్సువాడ పట్టణంలోని ప్రధాన ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. బస్‌స్టాండ్ అవుట్‌గేట్ వద్ద ఆటోలు, ఇతర వాహనాలు అడ్డంగా నిలబడటంతో బస్సులు బయటకు రావడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్‌స్టాండ్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఉన్నప్పటికీ ఆటో డ్రైవర్లు దాన్ని పట్టించుకోకుండా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలబెట్టి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ట్రాఫిక్ గందరగోళంగా మారుతోంది. అదేవిధంగా బస్‌స్టాండ్ వద్ద కనీసం ఒక సెక్యూరిటీ గార్డు కూడా లేకపోవడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. బస్సులు బయటకు వస్తున్న సమయంలో ప్రయాణికులు రోడ్డుపై తిరుగుతుండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని



స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు ఈ బస్‌స్టాండ్‌ను వినియోగిస్తున్నప్పటికీ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ఆటోల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# భానుడి వేడితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## – డాక్టర్ షరీఫుద్దీన్

**వేద న్యూస్, పెద్ద శంకరంపేట్ :**



మార్చి నెలలోనే ఎండలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్ద శంకరంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా. షరీఫుద్దీన్ తెలిపారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు సుమారు 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు మరియు పొలం పనులు చేసే రైతులు ఎండ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒకవేళ తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తె తలగుడ్డ, టోపీ ధరించాలని సూచించారు.ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. తగినంత నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరంలో నీటి లోపం రాకుండా ఉంటుందని చెప్పారు. పిల్లలు ఎక్కువసేపు ఎండలో ఆ×డకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు పొలం పనులు చేసే సమయంలో ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పనులు చేయడం మంచిదని, మధ్యాహ్నం ఎండలో ఎక్కువసేపు పనిచేయకుండా ఉండాలని తెలిపారు. ఎండ వల్ల తలనొప్పి, తల తిరగడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని డా. షరీఫుద్దీన్ సూచించారు.

వేద న్యూస్

శనివారం మార్చి 07, 2026

# బాధిత కుటుంబానికి రూ.4 లక్షల ఎల్ఓసి అందజేత

**– నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**

**వేద న్యూస్, రుద్రూర్ :**

అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదరాలికి బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అండగా నిలిచారు. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన కుర్లేం గంగమణి గత కొద్దికాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతుంది. ఆ కుటుంబం నిరుపేదది కావడంతో స్థానిక నాయకులు మాజీ విండో చైర్మన్ పత్తి రాముకి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలుపగా, వెంటనే స్పందించిన పత్తి రాము ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి నిరుపేద కుటుంబానికి భరోసా ఉండాలన్న మానవత దృక్పథంతో గుండె శాస్త్ర చికిత్స కోసం 4 లక్షల రూపాయల ఎల్ ఓ సి ని నిరుపేద కుటుంబానికి అందించారు. గుండె శాస్త్ర చికిత్స కోసం ఎల్ ఓ సి నిరుపేద కుటుంబానికి అందించామని స్థానిక నాయకులు పత్తి రాము తెలిపారు. నిరుపేదలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి పత్తి రాముతో పాటు కుర్లెం గంగమణి వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిన కమిషనర్

**వేద న్యూస్, మందమర్రి :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజులపాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులపాటు జరిగే మొదటిరోజు కార్యక్రమానికి మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొనగా కార్యక్రమం ప్రారంభంలో ప్రజలకు నిజాయితీతో సేవా చేయాలని మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన పరిపాలనను అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నేటి నుంచి జూన్ 12 వరకు జరిగే కార్యక్రమంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, మురికి కాలువల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి పెట్టబడుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారాలు అందించేందుకు మున్సిపల్ శాఖలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజాసేవల మెరుగుదల కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడానికి మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం, సహకారం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, అందరూ కలిసి పనిచేస్తే మన పట్టణాన్ని శుభ్రమైన, సుందరమైన అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దగలమని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఆఫీసర్ పి కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ ఈ రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఎం ఏ సమీర్, జూనియర్ అసిస్టెంట్లు వి వసంత్, బి ప్రదీప్, వినయ్ సామ్యూల్, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, ఎన్విరా న్ మెంటల్ ఇంజనీర్ ఎం గోపికృష్ణ, ఇన్చార్జి టిఎంసి ఎ రఘురాం, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించుకోవాలి

**– డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. రజిత**

**– మార్చి 6 నుంచి 31 వరకు వైద్య శిబిరాలు**




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు అన్ని వయసుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మొదటి దశలో మార్చి 6 నుంచి 31 వరకు గర్భిణీలు, వృద్ధులకు రక్తహీనత పరీక్షలు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రాల ద్వారా నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు గర్భిణీలు, తల్లులకు పోషకాహారం, టీకాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ కూడా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరాల్లో ప్రసూతి, శిశు వైద్యులు, నేత్ర, దంత, కీళ్ల ఎముకల నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెలలో హనుమాజిపేట, కోనరావుపేట, లింగన్నపేట, పోతుగల్, విలాసాగర్, ఎల్లారెడ్డిపేట, పెద్దలింగాపూర్, నేరెళ్ల, తంగళ్లపల్లి, కొదురుపాక, చీర్లవంచ, బోయినపల్లి తదితర ప్రాంతాల్లో అలాగే సిరిసిల్లలోని సుందరయ్య నగర్, అంబేద్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు పరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత తెలిపారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వేద న్యూస్, రుద్రూర్ :**




రుద్రూర్ మండల కేంద్రంలోని రాయకూర్ గ్రామ సబ్ స్టేషన్ లో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా 33/11 కేవి రాయకూర్ సబ్ స్టేషన్ పరిది గ్రామాలైన రాయకూర్, రాయకూర్ క్యాంప్, సిద్దాపూర్, రాణంపల్లి, సులేమాన్ నగర్, లింగంపల్లి, చిక్కడపల్లి గ్రామాల్లలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పైన తెలిపిన గ్రామాల ప్రజలు విద్యుత్ అంతరాయానికి సహకరించగలరని కోరారు.

# వేములవాడలో వైభవంగా రాజన్న కల్యాణం

**– పోటెత్తిన భక్తజనం..**

**– శివనామస్మరణతో మారుమోగిన క్షేత్రం**

**– స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన విప్ ఆది శ్రీనివాస్**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినోత్సవాలను పురస్కరించుకుని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శివ కళార్చన వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కళ్యాణ మండపంలో అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారి వివాహ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల జయజయధ్వానాల మధ్య శివకళ్యాణం వైభవంగా జరిగిందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా గుడి చెరువు ఆవరణలోని పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వేడుకను నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచిందన్నారు. ఈ మహోత్సవాన్ని దర్శించేందుకు సుమారు 70 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లతో పనులు చేపడుతున్నామని, త్వరలోనే ఆలయ రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు. రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**– అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోతి**

**– సిరిసిల్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**

**వేద న్యూస్, సిరిసిల్ల:**



సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారి సాధికారతను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఈ. జ్యోతి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వ ర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. నీరజ ఆదేశాలతో, సీనియర్ సివిల్ జడ్జి/డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. లక్ష్మణాచారి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. మహిళలు కుటుంబం, విద్య, వైద్యం, రాజకీయాలు, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో విశేష సేవలు అందిస్తూ సమాజ పురోగతికి తోడ్పడుతున్నారని అన్నారు. మహిళల సాధికారత, భద్రత, గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్ల కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# పచ్చని చొప్పదండిలో చిచ్చు పెట్టొద్దు

**– మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి**

**– కేటీఆర్, హరీష్ రావు పై విమర్శలు**

**వేద న్యూస్, చొప్పదండి:**



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు చొప్పదండి నియోజకవర్గంలో రాజకీయ చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రాష్ట్రంలో కేటీఆర్, హరీష్ రావు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. గంగాధర మండలం మధురానగర్‌లోని ఎమ్మెల్యే ప్రజా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల కోసం చొప్పదండి ప్రాంత రైతుల భూములు తీసుకుని అన్యాయం చేశారని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ చొప్పదండి నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. వరదకాలువ పనులను ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్న ఘనత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకే దక్కుతుందని అన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు రూ.23.50 కోట్లు పరిహారం మంజూరు చేయించారని, మరో రూ.20 కోట్లు మంజూరు చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చాకుంట క్రాస్ రోడ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**– ఇద్దరు యువకులు మృతి**

**– బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్**

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పరిధిలోని రుక్మాపూర్ గ్రామ సమీపంలోని చాకుంట క్రాస్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రుక్మాపూర్ గ్రామం నుంచి చాకుంట వైపు వెళ్తున్న TS08FF6269 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని కరీంనగర్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న TS15UA1818 నంబర్ గల టిప్పర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రుక్మాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ సాయికిరణ్, చిలుక ప్రదీప్ కుమార్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు ప్రదీప్ తండ్రి చిలుక రాజేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టిప్పర్ డ్రైవర్ ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన సాయవేణి ప్రవీణ్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

# బ్యాంకు ఖాతాదారులకు ఆరోగ్య సౌకర్యాలు

**– యూనియన్ బ్యాంక్ ప్రత్యేక పథకం – మేనేజర్ తిరుపతి**

**వేద న్యూస్, చందుర్తి:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు ప్రత్యేక సౌకర్యాలతో కూడిన బ్యాంక్ ఖాతాలను అందిస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ తిరుపతి తెలిపారు. కొత్తగా ఖాతా తెరవనున్న వారికి ఆరోగ్య బీమా, ఉచిత క్యాన్సర్ కేర్, ఇన్సూరెన్స్ కవరేజ్, పర్సనల్ యాక్సిడెంటల్ కవరేజ్ వంటి ప్రత్యేక ప్రయోజనాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ పథకం ముఖ్యంగా మహిళల కోసం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఖాతా తెరవదలచిన వారు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఫోటోలు తీసుకుని మల్యాల గ్రామంలోని బస్టాండ్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ శాఖను సంప్రదించాలని బ్యాంక్ అధికారులు సూచించారు.

వేద న్యూస్

శనివారం మార్చి 07, 2026

# స్కూల్ అడిగితే సంకెళ్లా?

- వినతిపత్రం ఇవ్వడమే నేరమా?
- విప్ పర్యటన వేళ చందుర్తిలో అరెస్టుల పర్వం
- చందుర్తిలో వార్డు మెంబర్ మర్రి రమేష్ అరెస్టు
- పోలీసుల చర్యలపై స్థానికుల ఆగ్రహం



**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటన సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను చందుర్తిలోనే నిర్మించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధమైన వార్డు సభ్యుడు మర్రి రమేష్‌ను పోలీసులు అరెస్టు చేయడం వివాదాస్పదంగా మారింది. స్థానికుల వివరాల ప్రకారం, రూ.200 కోట్లతో మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తమ ప్రాంతంలో నిర్మించాలని కోరుతూ కమిటీ సభ్యులు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో వార్డు సభ్యుడు మర్రి రమేష్‌ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానికులు, పలు కుల సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం స్కూల్‌ను చందుర్తిలో ఏర్పాటు చేయాలని కోరడమే తప్పు కాదని, ప్రజా ప్రతినిధులను అరెస్టు చేయడం సరైన చర్య కాదని వారు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వినాల్సిన ప్రజాప్రతినిధులు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు ఆక్రమణాలపై సమగ్ర విచారణ జరపాలి

- ఆక్రమణలు తొలగించి దోషులను శిక్షించాలి
- సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు

**వేద న్యూస్, కరీంనగర్:**







కరీంనగర్ నగరంలో రోడ్లు, ప్రభుత్వ భూములపై జరుగుతున్న అక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల ని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. కొందరు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా ఆక్రమిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రామచంద్రాపూర్ కాలనీ, భగత్ నగర్ ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి భవనాలు నిర్మించారని పేర్కొన్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించి విక్రయించిన ఘటనలు కూడా ఉన్నాయని ఆయన విమర్శించారు. చెరువులు, కుంటలు, పరం పోగు భూములు కూడా అక్రమాలకు గురవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమణలను తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని, లేకపోతే ఈ అంశాలపై ప్రజా ఆందోళనలు చేపడతామని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

# టోల్ గేట్ 3డీ మ్యాపింగ్

- ఆందోళన చేపట్టిన రైతులుత




**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం శివారులో ప్రతిపాదిత టోల్ గేట్ నిర్మాణానికి సంబంధించి అధికారులు 3డీ మ్యాపింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, శాయంపేట సీఐ, ఎస్ఐలతో పాటు భారీ పోలీసు బందోబస్తు మధ్య సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా భూభాధిత రైతులు మ్యాపింగ్‌ను అడ్డుకోవడంతో అధికారులు ఇది కేవలం 3డీ మ్యాపింగ్ మాత్రమేనని, ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు చేస్తున్న ప్రాథమిక సర్వేనని వివరించారు. రైతుల అనుమతి లేకుండా భూములు స్వాధీనం చేసుకోరని చెప్పడంతో రైతులు సర్వేకు సహకరించారు. బాధిత రైతుల తరఫున పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, మారపల్లి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. టోల్ గేట్ నిర్మాణం వల్ల రైతులకు నష్టం జరగకూడదన్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ భూమి ఉండగా అక్కడే టోల్ గేట్ నిర్మాణం చేపడితే రైతులకు ఇబ్బంది ఉండదని సూచించారు. తమ కుటుంబాలు ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నాయని, భూములు కోల్పోతే జీవనోపాధి దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పేద రైతులకు నష్టం కలగకుండా అధికారులు పునరాలోచించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాడ రాఘవరెడ్డి, నోముల సుదర్శన్, రాధిక, రజిత, మహేందర్, సాగర్, రాణి, మమత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు ప్రతిష్టాత్మకం కోర్టు భవన నిర్మాణం

- నేడు శంకుస్థాపన కార్యక్రమం
- హాజరుకానున్న హైకోర్టు న్యాయమూర్తులు




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న కోర్టు భవన సముదాయం జిల్లాకు మరో ప్రతిష్టాత్మక ఆకర్షణగా నిలవనుంది. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్న ఈ భవన నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. పాత కోర్టు భవనం స్థానంలోనే సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81.60 కోట్ల వ్యయంతో నూతన కోర్టు భవన సముదాయం నిర్మించనున్నారు. ఈ భవనంలో 12 రకాల న్యాయస్థానాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో అంతస్తు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరుగనుంది. విశాలమైన కోర్టు హాళ్లు, ప్రతి అంతస్తులో వాష్‌రూమ్‌లు, కక్షిదారులకు ప్రత్యేక వెయిటింగ్ హాళ్లు, కనీసం 300 కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు. సెల్లార్‌తో పాటు టెన్ ప్లస్ టూ నమూనాలో నిర్మాణం చేపట్టి రాబోయే రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో పాల్గొననున్నారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాం జి, జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్ ముఖ్య అతిథులుగా హాజరవనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ తెలిపారు. జిల్లాలోని న్యాయవాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. విలేకరుల సమావేశంలో న్యాయమూర్తులు బి. పుష్పలత, రాధిక జైస్వాల్, పి. లక్ష్మణ చారి, ఎ. ప్రవీణ్ కుమార్, న్యాయవాదుల సంఘం సిరిసిల్ల, వేములవాడ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# నిమ్మపల్లిలో అడ్డగోలుగా భూకబ్జాలు

**వేద న్యూస్, కోనరావుపేట:**





రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో భూములు, చెరువులు భూకబ్జాదారుల బారిన పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలోని చెరువు ఉప్పరివాడ ప్రాంతంలో భారీ స్థాయిలో భూములు ఆక్రమణకు గురవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. భూకబ్జాదారులు విచ్చలవిడిగా భూములను ఆక్రమిస్తున్నారని, దీనిపై అడిగే వారు లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. కొందరు మాజీ ప్రజాప్రతినిధులు కూడా డబ్బులు తీసుకుని కబ్జాదారులకు మద్దతు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ఊర చెరువు, అలాగే బయట ఉన్న పెద్ద చెరువు ప్రాంతాల్లో కూడా అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసి వేల ఎకరాలకు నీరు సరఫరా చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులు లంచాలు తీసుకుని అక్రమాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చెరువుల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బోర్లు, మోటార్లను తొలగించి, అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు ఆక్రమణ ఆరోపణలు అసత్యం

- చట్టబద్ధ స్థలంలోనే నిర్మాణం
- డిప్యూటీ మేయర్ సునీల్ రావు



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ భగత్‌నగర్‌లో రోడ్డును ఆక్రమించి కార్యాలయం నిర్మించారని వస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్పష్టం చేశారు. ఈ విషయంపై కొందరు మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు వాస్తవాలకు విరుద్ధమని తెలిపారు. భగత్‌నగర్‌లోని ఆ స్థలాన్ని 1997లో న్యాయవాది ఎడవల్లి జగ్గారెడ్డి జిడిగ భూమయ్యకు విక్రయించగా, 2004లో భూమయ్య నుంచి తాము చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసినట్లు వివరించారు. ఆ సమయంలోనే 15 అడుగుల రహదారి కోసం స్థలం విడిచిపెట్టి మిగిలిన భాగాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. తాము కొనుగోలు చేసిన స్థలంలోనే 2014లో కార్యాలయ నిర్మాణం చేపట్టామని, అప్పటి నుంచి మున్సిపల్ పన్నులు చెల్లిస్తూ చట్టబద్ధంగా వినియోగిస్తున్నామని తెలిపారు. రహదారిని ఆక్రమించి నిర్మాణం చేశారన్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారు వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ సునీల్ రావు హెచ్చరించారు.

# సిటీ కాలేజీలో 'ప్రగతి ప్రణాళిక' ప్రారంభం

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (99 రోజులు) కార్యక్రమం అమలు నేపథ్యంలో సిటీ కాలేజీలో సమావేశం నిర్వహించారు. కళాశాల విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ప్రిన్సిపాల్ ప్రొ. సి. హెచ్. ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్యక్రమం ఉద్దేశాలు, మార్చి 6 నుంచి 15 వరకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమం ద్వారా కళాశాలల్లో పరిశుభ్రత, పరిపాలనా సామర్థ్యం, రికార్డు నిర్వహణ, డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమాల అమలుకు పలు కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా తొలి రోజు కళాశాల తరగతి గదులు, ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. కీర్తి, డా. తిరుపతి, డా. శ్రీదేవి, డా. సుదక్షణ, డా. రవీంద్ర పర్యవేక్షణలో అధ్యాపకులు, విద్యార్థులు కలిసి కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. పి. శాంతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు మార్చి 15 వరకు కొనసాగనున్నాయి.




పరిశుభ్రత కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ వలంటీర్లు

# ఇలలో వెలసిన శక్తి మహిళ

**- అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గోలి శిరీష**



**వేద న్యూస్, హుజూరాబాద్:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంజెపి హుజురాబాద్ జెఎల్ తెలుగు విభాగానికి చెందిన గోలి శిరీష మహిళల గొప్పతనాన్ని కొనియాడుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళ సమాజ నిర్మాణానికి మూలస్థంభం, కుటుంబానికి అండగా నిలిచే మహాశక్తి అని ఆమె పేర్కొన్నారు. భూమాతకు ఉన్న సహనంలా మహిళకు అపారమైన సహనం ఉంటుందని, ఈ సృష్టిలో మహిళ ఒక గొప్ప సృష్టికర్త అని అన్నారు. తల్లిదండ్రులకు ఆప్యాయతను పంచే కూతురుగా, సోదరులకు అనురాగాన్ని అందించే సోదరిగా, భర్తకు తోడుగా నిలిచే భార్యగా మహిళ ఎన్నో బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తుందని తెలిపారు.అలాగే తల్లి రూపంలో పిల్లలను ప్రేమతో పెంచి, కుటుంబాన్ని సుసంపన్నంగా నడిపించే అంగనగా మహిళ సమాజంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కరుణ, జాలి, ప్రేమ, సహనం వంటి విలువలకు మహిళే ప్రతిరూపమని ఆమె చెప్పారు.గతంలో అబలగా భావించిన మహిళ నేడు విద్య, ఉద్యోగం, రాజకీయాలు, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో సబలంగా ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. మహిళల సాధికారతే సమాజ పురోగతికి మూలాధారమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ గోలి శిరీష అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే నాయిని

**- ఎన్జీవోస్ కాలనీలో గోపుర నిర్మాణానికి భూమిపూజ**



**వేద న్యూస్, హనుమకొండ:**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 59వ డివిజన్ వికాస్ నగర్ కాలనీలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభయాంజనేయ స్వామి పునఃప్రతిష్ట మహోత్సవం కూడా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని స్వామివారిని దర్శించుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. అనంతరం 58వ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి దక్షిణ గోపుర నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని, ఇలాంటి దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి 99 రోజుల యాక్షన్ ప్లాన్

**- నల్లబెల్లిలో సర్పంచులు, అధికారులతో సమావేశం**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి పసర గొండ రవి మాట్లాడుతూ.. మార్చి 6 నుంచి 15 వరకు గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీలు, మార్కెట్లు శుభ్రపరచడం, పాత సామగ్రి తొలగించడం, తడి, పొడి చెత్త వేరు చేయడం, ఘన వ్యర్థాలు, ఈ వేస్ట్ సేకరణ చేపట్టాలని తెలిపారు. అలాగే రోడ్లు, డ్రైనేజీల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఓహెచ్ఎస్ఆర్ క్లోరినేషన్, పాత బావులు పూడ్చడం, చెరువులుకుంటల శుభ్రపరిచే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి 'ఫ్రైడే-డ్రై డే' పాటించాలని, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి పీపీఈ కిట్లు అందించడంతో పాటు ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎర్రబెల్లి రఘుపతిరావు మాతృమూర్తికి

**ఎమ్మెల్యే దొంతి నివాళి**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘుపతిరావు మాతృమూర్తి ప్రమీల మృతి పట్ల నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గాఢ సంతాపం వ్యక్తం చేశారు. మండల ంలోని రేలకుంట గ్రామంలో గురువారం రాత్రి ప్రమీల తుదిశ్వాస విడిచారు. శుక్రవారం రేలకుంటకు చేరుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రఘుపతిరావు, కమలాకర్ రావును ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్ రావు, జిల్లా కార్యదర్శి మాలోతు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధారి తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్ గౌడ్, నందిగామ-రేలకుంట గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంగళదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.

# అత్యంత ప్రాధాన్యతతో అంధుల పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

అంధుల విద్యాభివృద్ధి కోసం అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.శుక్రవారం జెడ్పీ సెంటర్ లోని నిజాంపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అంధుల పాఠశాల నిర్మాణ పురోగతి పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనుల ప్రతి భాగాన్ని పరిశీలించి భవన నిర్మాణ నాణ్యత, ప్రహరీ గోడ గేట్, ప్రవేశ మార్గాలు, అంతర్గత గదుల రూపకల్పన, గ్రీనరీ, మొక్కలు, టైల్స్, ప్రత్యేకంగా టాయిలెట్స్, తరగతి గదులు, నైపుణ్యాభివృద్ధి కోసం ఏర్పాట్లు, మ్యూజికల్ రూం తదితర సదుపాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అంధులు పాఠశాలలో ప్రవేశించిన క్షణం నుంచి బయటికి వెళ్లే వరకు పూర్తిస్థాయి భద్రత, సౌలభ్యం లభించేలా నిర్మాణంలో ప్రతిదీ ఖచ్చితంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంధ పిల్లల చదువుల కోసం వారి తల్లిదండ్రులు ప్రజావాణిలో అర్జీలు ఇచ్చినప్పుడు ఒక ఆలోచనతో అంధుల భవిష్యత్తుకు కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు కార్యచరణ చేపట్టి నేడు పూర్తి దశలలో ఉన్న పనుల పట్ల కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అంధుల బ్రెయిలీ లీపి కోసం ప్రత్యేకమైక డిజిటల్ అడియో డివైజర్ ద్వారా అంధ విద్యార్థి ఉపయోగించే విధానం పరిశీలించారు. అంధ విద్యార్థిని జి. భవాణి ఇలాంటి అధునాతన సౌకర్యాలు కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేసినందుకు కలెక్టర్ భావోద్వేగాలకు లోనయ్యారు.

జిల్లాలో అంధ విద్యార్థులు ఈ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... అంధుల విద్యా అవకాశాల దృష్ట్యా ప్రత్యేక పాఠశాల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ, మిగిలిన పనులను వేగవంతం చేసి అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు.ఆడియో సూచనలు తో పాఠాలు మరింత సులభంగా అర్థమయేందుకు బ్రెయిలీ లీపి చదవటం, టైప్ చేయటం, రాయటం నేర్పడానికి ప్రత్యేకంగా రూపొందించబడిన బ్రెయిలీ లిటరసీ డివైస్ లను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. దృష్టి, కంఠ పరిమితి ఉన్న విద్యార్థులు తామే బ్రెయిలీ నేర్చుకోవచ్చని, పాఠ్యాంశాలు, ఆట అంతర్లీన పాఠాలు ద్వారా ఆటలు, పరీక్షలు, వ్యాయామాలు ఆడియో ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అంధ విద్యార్థులు స్వతంత్రంగా కదలాడేందుకు వీలుగా పాఠశాలను పూర్తిగా బారియర్ ఫ్రీ విధానంలో నిర్మించామని అన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేయనున్న సెన్సరీ రూమ్, సెన్సరీ గార్డెన్ అంధ విద్యార్థులలో స్పర్శ, శబ్దం, వాసన, దిశ అవగాహన, సమతౌల్యం వంటి సామర్థ్యాలను పెంచుతాయని కలెక్టర్ వివరించారు. ప్రత్యేక విద్యా మోడళ్లను ఆధారంగా తీసుకుని ఈ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంధ విద్యార్థులకు పాఠశాలలో బ్రెయిల్ లిపి పుస్తకాలు, ఆడియో బుక్స్, లెర్నింగ్ డివైజ్‌లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. నేటితరానికి అనుగుణంగా అంధుల్లో ముఖ్యమైన కంప్యూటర్ స్కిల్స్ కోసం ల్యాబ్‌ను స్మార్ట్ టెక్నాలజీతో ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ స్క్రీన్ రీడర్లు, డిజిటల్ లెర్నింగ్ మాడ్యూల్స్ ద్వారా పాఠాలు నేర్చుకునేలా వాతావరణం ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ప్రమాదావకాశం లేకుండా చైల్ట్-సేఫ్ స్విచ్‌లు, హై క్వాలిటీ వైరింగ్, అనుకూలమైన లైటింగ్ సిస్టమ్ ఉన్నాయని తెలిపారు. అంధ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన డెస్కులు, కుర్చీలు, నేర్చుకునే పరికరాలు, సమకూర్చమని, అంధుల పాఠశాల పూర్తయిన తర్వాత ఖమ్మం జిల్లాలోని అంధ విద్యార్థులకు ఇది ఒక ఆధునిక విద్యా కేంద్రంగా నిలుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, సీఎంవో ప్రణీవ్ కుమార్, ఏఈ చిరంజీవి, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు ఉన్నారు.

# బాధ్యతతోనే అభివృద్ధి సాధ్యం

**- శానగర్ సర్పంచ్ శైలజ**



**వేద న్యూస్, రామడుగు:**

సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేసినప్పుడే అభివృద్ధి ఫలాలు అందుతాయని శానగర్ సర్పంచ్ గునుకొండ శైలజ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామ పంచాయతీ స్టోర్ రూమ్‌ను శుభ్రపరిచారు. ఆవరణలో ఉన్న మట్టి కుప్పలను కూడా తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గునుకొండ శైలజ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిరుత అంజయ్య, మాజీ సర్పంచ్ అశోక్, పంచాయతీ కార్యదర్శి మదు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం రేడియో స్టేషన్ లో కట్టెకోలకు సత్కారం

**- నరసయ్యను అభినందించిన స్టేషన్ డైరెక్టర్ శంకర్రావు**




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు ఘన సత్కారం లభించింది. కొత్తగూడెం రేడియో స్టేషన్ డైరెక్టర్ కొలిపాక శంకర్రావు ఆధ్వర్యంలో ఖమ్మం భద్రాది కొత్తగూడెం జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రుల చేత శుక్రవారం పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. వ్యాఖ్యాతగా కట్టా రామకృష్ణ వ్యవహరించారు. ఈ కవి సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్య అమానవీయ యుద్ధాలు అనే శీర్షికన రచించిన కవితను ఆలపించారు. ప్రపంచంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ కవిత సమాజానికి అద్దం పట్టిందని ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ శంకర్రావుతో పాటు పలువురు నరసయ్యను అభినందించారు. అనంతరం కట్టెకోలను పూలు, పండ్లతో తువ్వాలు కప్పి ఘనంగా సత్కరించారు.

# ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో వార్డుల సమగ్ర అభివృద్ధి



**వేద న్యూస్, జమ్మికుంట:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డులలో ఉన్న శానిటేషన్, ఎలెక్ట్రిషన్ వంటి సమస్యలను పరిష్కరించి పట్టణ అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ లు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్, వైస్ ఛైర్మన్ ముంతాజ్ అలీ, మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, సిబ్బందితో పట్టణ ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు మాట్లాడుతూ.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డులు రోజుకు మూడు వార్డుల చొప్పున 10రోజుల వ్యవధిలో 30 వార్డులలో ఉన్న శానిటేషన్, ఎలెక్ట్రిషన్ వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి మార్చి 15వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వార్డుల్లో ఉన్న సమస్యలను ఒక ప్రణాళిక ప్రకారంగా చేసి పరిష్కరిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, ఏఈ వికాస్, టిపిఎస్ రాజ్ కుమార్, టిపిబివో దీపిక ,సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శ్రీనివాస్ లతో పాటు అధికారులు, సిబ్బంది, మెప్మా అర్పిలు పలువురు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతికి సరికొత్త బాట




- 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి
- రెవెన్యూ, అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్,ఖమ్మం ప్రతినిధి:**

ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు.

**సాంకేతిక లోపాలు సరిదిద్ది.. బాధ్యతను నిర్ధారించాలి**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

**అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు**

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ మరియు రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు మరియు రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ.. నిధుల వినియోగం**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు మరియు చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు.

**సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యం**

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకూ భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

**పార్టీలకు అతీతంగా ప్రజా సేవ**

ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీ

**వేద న్యూస్, మందమర్రి :**



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియాలోని సి ఈ ఆర్ క్లబ్ లో మహిళలకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు ఎ న్ శ్రీవాణి రాధా కృష్ణ విచ్చేసి మహిళలకు ముందస్తు మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళ లకు బాంబ్ ఇన్ బ్లాస్ట్, గ్రూప్ డ్యాన్సులు, స్కిట్ నిర్వహణ వివిధ రకాల క్రీడలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు మందమర్రి ఏరియా నుండి 200 మంది మహిళలు, సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ పోటీలలో గెలుపొందిన మహిళలకు మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు బహుమతులు ప్రధానోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ సెల్, సేవాసమితి కోఆర్డి నెటింగ్ ఆఫీసర్ అర్ సత్యనారాయణ ( సీనియర్ పిఓ ) మహిళా ఉద్యోగులు, పరిసర ప్రాంత మహిళలు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ కౌన్సిలర్లకు ఘన సన్మానం

**వేద న్యూస్, జమ్మికుంట:**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ లో ఎన్నికల్లో ఎన్నికైన బిజెపి పార్టీ కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్ తూర్పాటి చందన శంకర్, గుర్రం కావ్య పరశురాం, కొలకాని రాజకుమారి రాజు లను శుక్రవారం పార్టీ శ్రేణులు ఘనంగా మున్సిపల్ చైర్మన్ ములుగు దిలీప్ ఆధ్వర్యంలో సన్మానించారు. బిజెపి నాయకులు శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామ ని చెప్పారు. ఎర్రబెల్లి సంపత్ రావు, జీడి మల్లేష్ శాలువాలతో కాన్సిలర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ రావు, బిజెపి మాజీ పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్, ఇల్లంతకుంట మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, పల్లపు రవి, మోతే స్వామి, ఇటికాల సరూప, కొమ్ము అశోక్ నీలం కుమార్, కొండ్లె నాగేష్, లోకిని రాజేష్, నీలం కుమార్, కొండపర్తి ప్రవీణ్, అప్పల రవీందర్, యమ్సాని సమ్మయ్య, కన్నబోయిన బద్రి, దేవు నవీన్, కుంభాల వెంకటరాజ్యం, ఇల్లందుల శ్రీనివాస, బిజెపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కలకలం..

**వేద న్యూస్ హనుమకొండ:**



హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీ లో శుక్రవారం ఉదయం చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఓ మహిళ మెడలో నుంచి.. బంగారు గొలుసు లాక్కొని ఇద్దరు దుండగులు బైక్‌పై పారి పోయారు. ఈ ఘటనతో బాధితురాలు మామిండ్ల నవ్య ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. దొంగలను పట్టుకు నేందుకు బైక్ వెనుక కొద్దిదూరం ఆమె పరిగెత్తింది. కానీ లాభం లేకుండాపోయింది. ఈ చోరీపై బాధితురాలు నవ్య.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని వివరాలను సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. అందులో నవ్య మెడలో నుంచి గోల్డ్ చైన్ లాక్కెళ్లడం, వారి వెంట నవ్య పరిగెత్తడం స్పష్టంగా రికార్డయ్యాయి. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

## సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేయాలి - మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా గుర్తించి పరిష్కరించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు సంబంధించిన ప్రతి చిన్న సమస్య కూడా ప్రభుత్వ దృష్టికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాకు అవసరమైన అభివృద్ధి అంశాలపై సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుందని మంత్రి తెలిపారు. ప్రజలు మరియు ప్రభుత్వానికి మధ్య అధికారులు వారధులుగా ఉంటారని, అధికారుల పనితీరుతోనే ప్రభుత్వానికి మంచి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పట్టుదలతో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి వరంగల్ జిల్లాను ముందువరుసలో నిలిపేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. అలాగే ప్రజల సమస్యల పరిష్కారంలో ఏ అంశాన్నీ నిర్లక్ష్యం చేయకుండా రెవెన్యూ శాఖతో పాటు పోలీస్ శాఖ సమన్వయంతో భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి సమాచారం వారి సెల్‌ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి కొండా సురేఖ కోరారు.

## తస్మాత్ జాగ్రత్త..!

- రుద్రూర్-వర్ని రహదారిపై ప్రయాణిస్తుంటే
- నిర్లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న సంస్థ..!?
- ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కత్తి గంగారం మృతి



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్-వర్ని రహదారి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రోడ్డు నిర్మాణ సంస్థ రహదారిపై ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డెక్కితే చాలు సురక్షితంగా గమ్యం చేరతామా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏ వైపు నుంచి మృత్యువు వెంబడిస్తుందో తెలియని దుస్థితి. పొంచిఉన్న ప్రమాద ప్రాంతాలు దీనికి తోడు రోడ్డు నిర్మాణ సంస్థ సరైన నిబంధనలు పాటించక నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రుద్రూర్ మండలం అక్బర్ నగర్ ఫుడ్ సైన్స్ కాలేజ్ ముందు ఫిబ్రవరి 28న రాత్రి సమయంలో రోడ్డు పై పోసిన మొరం కుప్ప పై పడి కత్తి గంగారాం తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ నిజామాబాద్ ప్రవేట్ ఆసుపత్రి లో శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఏలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా నడిరోడ్డుపై మొరం కుప్పలు వేయడంతో అదే రోజు సుమారు 8 మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. స్వల్ప గాయాలతో కొంతమంది త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ 5రోజులు మృత్యువుతో పోరాడిన కత్తి గంగారాం శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ప్రభుత్వం ప్రజా సౌకర్యార్థం రోడ్డు నిర్మాణాలు చేపడుతుంటే నిర్మాణ సంస్థ సరైన నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతుంది ఎన్నో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కొంతమంది ప్రమాదాల బారిన పడి జీవితాలు హస్తవ్యస్తం అవుతున్నాయి. ఇంత జరుగుతున్న నిర్మాణ సంస్థ ఉలుకు పలుకు లేకుండా వ్యవహరిస్తోంది. నిర్లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న నిర్మాణ సంస్థపై సంబంధిత శాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అదే రోజు రాత్రి ఘటన స్థలంలో అక్బర్ నగర్ గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మృతి చెందిన కత్తి గంగారం కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వేద న్యూస్

శనివారం మార్చి 07, 2026

# వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు



**వేద న్యూస్, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని అటవీ ప్రాంతమైన కర్ణపేటలో అటవీశాఖ మరియు ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో అడవుల సంరక్షణ మరియు వన్యప్రాణుల రక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మరియు ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ... కింది కీలక అంశాలను ప్రజలకు వివరించారు.

**అడవి మంటల నివారణ:**

వేసవిలో చిన్న నిప్పు రవ్వ వల్ల అడవి మొత్తం తగలబడే ప్రమాదం ఉందని, ఉద్దేశపూర్వకంగా అడవికి నిప్పు పెట్టడం భారత అటవీ చట్టం ప్రకారం నేరమని హెచ్చరించారు. అడవి తగలబడటం వల్ల పర్యావరణంతో పాటు అడవిలోని చిన్న చిన్న జీవులు, పక్షులు ఆహుతి అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**వన్యప్రాణుల వేటపై నిషేధం:**

ఎండల తీవ్రతకు దాహార్తిని తీర్చుకోవడానికి అడవిలోని నీటి కుంటల వద్దకు లేదా గ్రామాలకు సమీపంలోకి వచ్చే వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరం. ముఖ్యంగా పొలుసు పంది (పంగోలిన్), దుప్పులు, నెమళ్లు మరియు ఇతర అడవి జీవులను వేటాడితే 'వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972' ప్రకారం కనీసం 3 నుండి 7 ఏళ్ల జైలు శిక్ష మరియు భారీ జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

**ప్రజల బాధ్యత:**

అడవి మనందరి సంపద అని, అడవి బాగుంటేనే సకాలంలో వర్షాలు పడతాయని తెలిపారు. స్మగ్లర్లు లేదా వేటగాళ్ల మాటలు నమ్మి గిరిజన ప్రజలు మోసపోవద్దని, ఏదైనా అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. "అడవి బిడ్డలుగా అడవిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వన్యప్రాణులకు హాని కలిగించకుండా వాటిని స్వేచ్ఛగా బతకనిద్దాం" అని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ,సిబ్బంది ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.



# బుమ్రాకు దక్కని గుర్తింపు? నెట్టింట ఆసక్తికర చర్చ

**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెట్ జట్టులో కీలక బౌలర్‌గా నిలిచిన జస్ప్రీత్ బుమ్రా ప్రతిభకు తగిన స్థాయిలో గుర్తింపు దక్కడం లేదనే అంశంపై ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్ మ్యాచ్‌లో బ్యాటర్లకు అనుకూలమైన పిచ్‌పై పరుగుల వరద పారినప్పటికీ బుమ్రా తన అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్‌ను భారత జట్టు వైపు మలిచాడని అభిమానులు పేర్కొంటున్నారు. మొత్తం మ్యాచ్‌లో దాదాపు అయిదువందల పరుగులు నమోదైన నేపథ్యంలో కూడా బుమ్రా కేవలం నాలుగు ఓవర్లలో ముప్పై మూడు పరుగులు మాత్రమే ఇచ్చి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడం విశేషమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరిత దశలో ఉన్నప్పుడు వేసిన పదెనిమిదో ఓవర్ మ్యాచ్ గమనాన్నే మార్చేసిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఆ ఓవర్‌లో అతడు అద్భుతమైన యార్కర్లు, ఖచ్చితమైన లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఒత్తిడికి గురి చేశాడు. గతంలో కూడా ఓటమి అంచున ఉన్న అనేక మ్యాచ్‌లలో బుమ్రా తన మాయా బౌలింగ్‌తో భారత జట్టును గట్టెక్కించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అభిమానులు గుర్తు చేస్తున్నారు. క్లిష్ట సమయంలో వికెట్లు తీస్తూ జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నప్పటికీ అతనికి తగినంత ప్రశంసలు లభించడం లేదని నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారత క్రికెట్‌లో సాధారణంగా బ్యాటర్లకే ఎక్కువ ప్రాచుర్యం లభిస్తుందని, బౌలర్లకు అదే స్థాయి గుర్తింపు దక్కడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రముఖ బ్యాటర్లతో పోలిస్తే



బుమ్రాకు లభిస్తున్న ప్రకటనలు, వాణిజ్య ఒప్పందాలు మరియు సామాజిక మాధ్యమాల్లో అనుచరుల సంఖ్య తక్కువగా ఉండటం ఈ చర్చకు కారణమైంది. మ్యాచ్ గెలిపించే సామర్థ్యం ఉన్న ఆటగాడైనా గ్లామర్ మరియు మార్కెట్ విలువ పరంగా బౌలర్లకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుమ్రా వంటి ప్రతిభావంతులైన బౌలర్లకు కూడా సమాన స్థాయిలో గుర్తింపు ఇవ్వాలని అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా కోరుతున్నారు.

# న్యూజిలాండ్‌తో పోరు అంత సులభం కాదు

**వేద న్యూస్ డెస్క్:**



ఇరవై ఓవర్ల ప్రపంచకప్ తుది పోరుకు రంగం సిద్ధమైంది. ఆదివారం జరగనున్న ఈ కీలక పోటీలో భారత్, న్యూజిలాండ్ జట్లు కప్పు కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్‌లో తలపడుతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. అయితే ప్రపంచకప్ చరిత్రలో ఇరు జట్ల మధ్య జరిగిన పోటీల గణాంకాలను పరిశీలిస్తే న్యూజిలాండ్ జట్టుకు కొంత ఆధిపత్యం ఉన్నట్టు కనిపిస్తోంది. గతంలో మెగా టోర్నీల్లో ఎదురుపడిన సందర్భాల్లో న్యూజిలాండ్ జట్టు విజయం సాధించడం భారత అభిమానుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది. అయినప్పటికీ ప్రస్తుత భారత జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండొచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ప్రస్తుత న్యూజిలాండ్ జట్టు బ్యాటింగ్ విభాగం చాలా బలంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఓపెనర్లు ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్ దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. వీరికి తోడు రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్ వంటి ఆటగాళ్లు జట్టులో ఉండటంతో కివీస్ బ్యాటింగ్ శక్తి మరింత పెరిగింది. వీరిలో ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా మ్యాచ్ గమనాన్ని మార్చగల సామర్థ్యం కలిగినవారే. అందువల్ల వీరిని నియంత్రించడం భారత బౌలర్లకు పెద్ద సవాలుగా మారనుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత బౌలింగ్ దళం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలోని పేస్ దళం ప్రారంభ ఓవర్లలోనే వికెట్లు సాధిస్తే మ్యాచ్ భారత్ వైపు తిరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పవర్‌ప్లేలో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడం భారత విజయానికి కీలకంగా మారనుంది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కూడా నియంత్రణతో బౌలింగ్ చేస్తే న్యూజిలాండ్ పరుగుల వేగాన్ని తగ్గించగలరు. గత గణాంకాలు ఏం చెబుతున్నాయన్నది పక్కన పెట్టి ఫైనల్ పోరులో కొత్త చరిత్ర రాయాలనే సంకల్పంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది. వ్యూహాత్మక ప్రణాళికలు, సమిష్టి ప్రదర్శనతో ఆడితే న్యూజిలాండ్ సవాల్‌ను భారత్ అధిగమించగలదని అభిమానులు ఆశిస్తున్నారు. సొంత గడ్డపై జరిగే ఈ తుది పోరులో విజయం సాధించి ప్రపంచకప్ కప్పును మరోసారి ఎత్తాలని భారత జట్టు దృఢ సంకల్పంతో సిద్ధమవుతోంది.



# సంపాదకీయం

## రైతుల సంక్షేమమే ఆహార భద్రతకు పునాది



వేద న్యూస్ డెస్క్ : భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా కొనసాగుతోంది. కోట్లాది మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల గ్రామీణ వ్యవసాయం బలోపేతం కావడం దేశ భవిష్యత్తుకు అత్యంత అవసరం. రైతుల సంక్షేమం, పంటల ఉత్పత్తి, ఆహార భద్రత వంటి అంశాలు దేశ అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయి. వ్యవసాయం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. ప్రస్తుతం రైతులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, పెరుగుతున్న సాగు ఖర్చులు వంటి సమస్యలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంటలకు సరైన ధరలు లభించకపోవడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులకు సరైన మద్దతు అందించడం ప్రభుత్వాల ముఖ్య బాధ్యతగా మారింది. రైతులకు ఆర్థిక సహాయం, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలి.

వ్యవసాయ రంగంలో పంటల మార్పు కూడా ఎంతో అవసరం. ఒకే పంటపై ఆధారపడకుండా విభిన్న పంటలను సాగు చేయడం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ధాన్యాలతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, తోటపంటలు వంటి పంటలను కూడా సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగవచ్చు. సాంప్రదాయ ధాన్యాలు అయిన జొన్నలు, రాగులు, సామలు వంటి సిరిధాన్యాల సాగు కూడా రైతులకు మంచి అవకాశాలను అందిస్తోంది. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ఈ ధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ కూడా పెరుగుతోంది. దేశంలో ఆహార భద్రతను కాపాడటంలో ధాన్యాల ఉత్పత్తి కీలక పాత్ర పోషిస్తుంది. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందువల్ల ధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం మరియు రైతులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన విత్తనాలు, సాగు సాంకేతికతలను వినియోగించడం ద్వారా పంటల దిగుబడిని పెంచవచ్చు. ఈ విధంగా వ్యవసాయ రంగంలో ఆధునికతను తీసుకురావడం ద్వారా రైతులకు మంచి లాభాలు సాధ్యమవుతాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వ్యవసాయం ఒక ప్రధాన ఆధారంగా నిలుస్తుంది. రైతుల ఆదాయం పెరిగితే గ్రామాల్లో ఆర్థిక చలనం పెరుగుతుంది. రైతులు బలపడితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. వ్యవసాయానికి అనుబంధ రంగాలు అయిన పశుపోషణ, కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం వంటి రంగాలు కూడా గ్రామీణ అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి సరైన విధానాలు అవసరం. రైతులకు సాగు ఖర్చులను తగ్గించే విధంగా సహాయాలు అందించాలి. సాగునీటి సదుపాయాలు, నిల్వ గోదాములు, మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలి. రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి మరియు సరైన సమయంలో మార్కెట్‌కు తీసుకెళ్లడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక యంత్రాలు, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, సమాచార సాంకేతికత వినియోగం ద్వారా రైతులు తమ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, పంటల సంరక్షణ పద్ధతులు వంటి విషయాలను రైతులకు సులభంగా అందించడం ద్వారా వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

గ్రామీణ వ్యవసాయం కేవలం ఆహారం ఉత్పత్తి చేసే రంగం మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలమైన ఆధారం. రైతులు బలపడితే దేశం బలపడుతుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం పురోగమిస్తుంది. అందువల్ల గ్రామీణ వ్యవసాయాన్ని బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన విషయం. రైతులకు అవసరమైన మద్దతు అందించడం, పంటల ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లడం వంటి చర్యలు తీసుకుంటేనే దేశ ఆహార భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుంది. గ్రామీణ వ్యవసాయం నిజంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన శక్తిగా నిలుస్తోంది.సాగునీటి సదుపాయాలు, నిల్వ గోదాములు, మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలి. రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి మరియు సరైన సమయంలో మార్కెట్‌కు తీసుకెళ్లడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక యంత్రాలు, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, సమాచార సాంకేతికత వినియోగం ద్వారా రైతులు తమ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, పంటల సంరక్షణ పద్ధతులు వంటి విషయాలను రైతులకు సులభంగా అందించడం ద్వారా వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

గ్రామీణ వ్యవసాయం కేవలం ఆహారం ఉత్పత్తి చేసే రంగం మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలమైన ఆధారం. రైతులు బలపడితే దేశం బలపడుతుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం పురోగమిస్తుంది. అందువల్ల గ్రామీణ వ్యవసాయాన్ని బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన విషయం. రైతులకు అవసరమైన మద్దతు అందించడం, పంటల ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లడం వంటి చర్యలు తీసుకుంటేనే దేశ ఆహార భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుంది. గ్రామీణ వ్యవసాయం నిజంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన శక్తిగా నిలుస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073